# దంపతులు

ఆ కుటుంబానికి అన్ని ఋతువులూ ఒక్కటే. వసంతం, గ్రీష్మం, హేమంతం, శరత్తు అన్నీ. వాళ్ళు ఆకాశం నవ్వటం చూడలేదు. వికసించిన వసంత పుష్పాలు తమ రంగుల్తో ఆ కుటుంబానికి ఆనందం చేకూర్చలేదు. వెలుగుకూ, చీకటికీ ఆ మానవాత్మలు చలించవు. ఒక్కటే వెలుగు. ఒక్కటే చీకటి. ప్రతి గుండెలోనూ ఒక మండే కుంపటి. అంతా నిరాశే గాని ఒక్కటే ఆశ. ఈ ఆశ అదృశ్య జ్యోతిగా ఇంటి చీకటిలో ప్రజ్వరిల్లుతున్నది. ఆ వెలుగు నవ్వులోనే వాళ్ళ జీవితాలు జరుగుతున్నవి. ఆ రోజున గూడా అందరి మనస్సుల్లోనూ ఆ వెలుగు వెలిగింది. కొందరిలో ఒక మహా జ్యోతిగా, కొందరిలో కొడిగట్టిన లాంతరు వత్తిగా. కాని, అందరిలోనూ ఆ పరబ్రహ్మ రూపం వెలగటమే ఒక విశేషం.

ఏదో ఒకనాడు ఎవరో ఆత్మ, కరుణ వున్న ఒక అబ్బాయి వచ్చి సీతను పెళ్ళి చేసుకుంటానంటాడు. తప్పదు. వస్తాడు. అంటాడు. అందరి గుండెల్లోనూ మండుతున్న కుంపట్లు తప్పక చల్లారి మాయమైపోతాయ్. ఈ లోకం గొడ్డుబోయిందా? అందరి ఆత్మలూ వరకట్న పిశాచికి బలి అయిపోలేదుగదా? సీతకు పెళ్ళయితే, ఇక పార్వతి వుంటుంది. సీతమ్మ పుణ్యాన పార్వతికి మంచి మొగుడే వస్తాడు.

ఈ ఆశతో రాళ్ళు సైతం పుష్పించ గలవు- ఈ ఆశతో దశ సహస్ర వర్షాలు బతకవచ్చు. ఈ దూరపు ఆశే ఆ యింటి చీకటిలో దీపజ్యోతి.

*          *          *

పోస్టు జవాను చేతులోనుంచి పార్వతి ఉత్తరం లాక్కొన్నది. ముసలాయన అరుగు మీదినుంచిలేచి లోపలకు వచ్చాడు. ఆయనకు ఉత్తరం చూచినా దగ్గు రాలేదు. ముఖంలో ఏ భావాతిశయమూ చూపకుండా ఆయన ఉత్తరం అందుకొని పెద్ద కూతురు చేతికందించారు ఏ వుత్తరం వచ్చినా పెద్ద కూతురు సీత చదివితేనే ఆయనకు తృప్తి. సీతను చూడగానే ఆయనకు శ్రీరాముడితో వనవాసం చేసిన సీతగాదు మనసుకు తట్టేది - శ్రీవిష్ణువుతో మహా వైభోగం

అనుభవిస్తూ, శేషతల్పంమీద చిరునవ్వు నవ్వుతున్న మహాలక్ష్మి ఆయనకు స్ఫురించేది.

కవరు చించి సీత వుత్తరం పైకి తీసింది.

"మామయ్య దస్తూరి."

ఈ మాటు ముసలాయన దగ్గాపుకోలేదు. ఈ తల్లిలేని బిడ్డలకు మామయ్యే తల్లి.

"ఏం రాస్తున్నాడమ్మా?"

సీత జవాబు చెప్పకుండా నవ్వింది. ఆ సమయంలో ఆ యింట్లో చీకటే లేదు.

"మీరే చదువుకోండి నాన్నగారూ!"

''వట్టి పిచ్చితల్లివి. చెల్లెమ్మకియ్యి, పెద్దగా చదువుతుంది."

అవును. ఈ లోకం గొడ్డుపోలేదట. వీరేశలింగం గతించినా, వివేకానందు డంతరించినా మానవుల్లో వాళ్ళు వెలిగించిన దివ్యదీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయట. తను ఇక వెయ్యేళ్ల బతకనక్కర్లేదు - గడపరాయి క్రింది ముగ్గు ప్రాణంతో లతను వేసి గుమ్మానికి తోరణం కడుతున్నది. కలలు సైతం తన విషయంలో గూడా ఒక్కోసారి నిజంగాక తప్పదు.

అవును. ఒక అబ్బాయి వస్తున్నాడు - సీతను చూట్టానికే! కట్నం అక్కర్లేదు!! సీతకు కొత్త పరికిణా, ఓణీ వున్నాయా? రేపే వస్తాడు. మంచివాడు.

ముసలాయన చూచేసరికి సీత అక్కడ లేదు. పార్వతి పకపకా నవ్వుతున్నది. ఇంట్లోవున్న లేమి, కప్పునుండి వేళ్ళాడుతున్న బూజు గుబుర్లు అన్నీ కల్యాణ సంగీతాన్నే పాడుతున్నవి. ఎవరు? ఎవరా అబ్బాయి?ఎట్లా వుంటాడు? వస్తాడా? చివరకు రాకపోతేనో? ఎబ్బే! మామయ్య రాశాడు గదా! రేపే. సీత ఆ రోజున చేసిన పనే పదిసార్లు చేసింది.

* * *

ఆహ్వాన ప్రయత్నాలన్నీ పూర్తి అయినై.

"అమ్మా, యింకా మంచి పరికిణీ కట్టుకోలేదేం తల్లీ?" అని ముసలాయన మంచంమీద వుతికిన జంబుఖాన పరుస్తూ అన్నాడు.

"అక్కయ్య చీరె కట్టుకుంటుందిట నాన్నా!" అని పార్వతి సమాధానం చెప్పింది.

"దానికింత ఆలోచనెందుకు తల్లీ - నీ యిష్టం."

సీత ఎర్రంచుల నేతచీరె కట్టుకున్నది. పార్వతి సీత ఓణీ పరికిణీ తను ధరించినది.

అబ్బాయి ఇంకా రాలేదు. ఒక్కడే వస్తాడా? తోడ్తో ఆ అబ్బాయి పెళ్ళి పెద్దలు వస్తారేమో? ముసలాయన మంచంమీది జంబుఖానా మడతలు సద్దుతున్న వాడల్లా పైన వుత్తరీయం వేసుకొని రివ్వున పంతులుగారింటికి పరుగెత్త బోయాడు.

"ఇప్పుడెక్కడికి నాన్నా?"

"కుర్చీ. పంతులుగారింట్లో నర్సారావుపేట పడకకుర్చీ తెస్తా!"

పార్వతి అక్కవంక చూసింది. సీత అద్దంలో తన బొట్టు సరిచూసు కొన్నది మళ్ళీ.

రోహిణికార్తె ప్రవేశించి యింకా నాలుగు రోజులు కాలేదు. అప్పుడే రోళ్ళు పగులుతున్నై. ఆ అబ్బాయి ఇంకా రాలేదు. చివరకు గుర్రబ్బండి చప్పుడు గూడా వినరావటంలేదు.

ముసలాయన దిగులుగా భోజనం ముందు కూర్చున్నాడు. ఎందుకు వస్తాడు, తన పిచ్చి భ్రమగాని? వీరేశలింగం, వివేకానందుడు తిరిగి అవతరిం చాలిగాని? కట్నంమీద ఎవరికి మమకారం లేదు గనక?

"పార్వతమ్మా, అక్కయ్యేమన్నా ఎంగిలి చేసిందా?'

''ఏదో అనిపించి లేచింది నాన్నా!''

"రాగారాగా కాకరకాయ కీకరకాయ అయినట్టుంది. నేనుండగా మీ కెందుకమ్మా అంత దిగులు? మీ నాన్న ఏమయినాడనుకొంటున్నారు?"

తను మహా ఘనుడైనట్లు, కట్నం ఎంతైనా పోసి మంచి సంబంధం వెదికి తీసుకు రాగలిగినట్లు. కిందటి సంవత్సరం విసిగి, ప్రాణం కడబట్టి, మామయ్య యిచ్చిన రెండొందలూ అయిపోగానే, ఏ గుడ్డివాణ్ణో, కుంటివాణ్ణో, బజారునపోయేవాణ్ణి తెచ్చి - యీ సీతకే అంటగట్టాలవి చూసిన నాన్నగాదూ

తను? ఎనిమిది రూపాయల పెన్షనుతో మూడు పొట్టల్ని నింపుతున్న నాన్న గాదూ తను?

బయట తలుపు చప్పుడైనది. ముసలాయన చేతిలో ముద్ద విస్తట్లో పడేసి అదరాబాదరా లేచి వచ్చాడు. అప్పటికే పార్వతి తలుపు తీసింది.

అవును. ఆ అబ్బాయి వచ్చాడు ఆ అబ్బాయి వచ్చాడు! లోపలి గదవలో కూర్చుండి సీత ఆ వ్యక్తిని చూసింది. వ్యక్తిగాదు "ఆ అబ్బాయి" మామయ్య రాసిన అబ్బాయి.

ఆ అబ్బాయి ధోవతి కట్టుకున్నాడు, తెల్లని ధోవతి. కొద్దిగా నలిగిన చొక్కా వుంది పైన. అయితే, జేబులో ఎత్తుగా కాయితాలున్నాయ్. అబ్బాయి పెద్ద స్ఫురద్రూపి కాడు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. ఇంత ఎండలోనూ ముఖాన చమటగుర్తైనా లేదు. చెప్పులకు బజారు ధూళి గూడా అంటినట్లు లేదు. ఎక్కడినుంచి వచ్చాడు? నడిచా? లేక వివేకానందుడు తన ఆత్మ శక్తితో, తపో మహిమతో యీ గడపముందు దిగవిడిచాడోయేమో! ఆ అబ్బాయి కళ్ళొక్కటే - మాట్లాడుతున్నై. ఆ కళ్ళలోనే వున్న ఆకర్షణంతా వుంది. నిశితమైన కళ్ళంటే కాదు మరి. చిలిపి వసలేకాదు, మరేదో నిర్మలమైన నిశ్చలమైన ఆకర్షణ.

చెప్పులు విడిచి, ముసలాయనకు ముందుగా నమస్కరించాడు.

"మా బావమరిది వుత్తరం నిన్ననే అందింది. ఇంత ఎండనబడ్డారే - పొద్దునంతా ఎదురుచూశాం"

ఆ అబ్బాయి "కనకసుందరంగారు రాశారన్నమాట" అని మెల్లగా నవ్వాడు. ఆ అబ్బాయివి సన్నని తెల్ల పళ్ళుగా తలుపువెనుక సీతకు కనిపించినవి.

ఇంతలోనే పార్వతి చెంబుతో కాళ్ళనీళ్ళు తెచ్చి పెట్టింది. ముసలాయన అనకముందే అబ్బాయి కాళ్ళు కడుక్కొన్నాడు ముసలాయన తన ఉత్తరీయం అందించాడు.

"ఎండనబడ్డారు - కొబ్బరినీళ్ళు కాసిని పుచ్చుకోండి."

కొబ్బరినీళ్ళొక్కటే ఆ యింట్లో కొనకుండా దొరికే వస్తువు.

కొబ్బరినీళ్ళు తాగుతూ ఆ అబ్బాయి, దూరాన నించొన్న పార్వతివంక చూశాడు. ముసలాయన గూడా పార్వతివంకకు తిరిగి చెయ్యి వూపాడు సీత వేపు చూపుతూ.

పార్వతివెనక తలవంచుకొని సీత నడిచివచ్చి మెల్లగా కూచొన్నది గడప ముందు చాపమీద. ఆ అబ్బాయి ఒక్క క్షణం అటుచూసిన తిరిగి ముసలాయన వంకకు మళ్ళాడు.

"గోత్రాలు, ఋషులూ అన్నీ సలక్షణంగా వున్నై."

ఆ అబ్బాయి వినిపించుకొన్నాడో లేదో.

"మా కనకసుందరం మీ పేరు రాయలేదు."

"నా పేరు వివేకానందం."

ముసలాయన వులిక్కిపడ్డాడు. ఆయన వివేకానందస్వామి శిష్యుడు.

"మరి—"

"దగ్గర్లోనే చూడండి."

ఆ యిల్లంతా ఒక్కసారి వెలిగింది. లగ్నం - లగ్నం - దగ్గర్లోనే చూడాలిట!

సీత చెవిలో పార్వతి వూదుతున్నది—

"ఈ కాలంలో దోవతు లెవ్వరూ కట్టటంలేదు. అందరూ సూట్లమీదే వుంటున్నారు. మా బావగారు కొంచెం సనాతనధర్మపరాయణుడల్లే వుంది."

సీత గోడమీద మాసివున్న వివేకానందస్వామి పటం చూపించింది చెల్లెలికి అతి రహస్యంగా.

"అబ్బో!"

వాళ్ళిటు తిరిగి చూసేటప్పటికి నాన్నగారూ, ఆ అబ్బాయి వీధిద్వారం దగ్గర నుంచొని వున్నారు.

"వెళ్ళిపోతున్నాడు అప్పుడే. నిన్ను పాటన్నా పాడమన్లేదు, నీకు మాటలు వచ్చో రావో గూడా తెలుసుకోకుండానే!"

"నా బదులు నువ్వు పాడినట్లున్నావ్!"

పార్వతి - లేని, రాని కోపంతో అక్క వంక చూసింది.

ఆ అబ్బాయి బలవంతం చేసినా వుండనంటే వుండనన్నాడు. గడప మెట్లు దిగుతూ, ముసలాయన వంకతిరిగి — "ఎవరు?" అని విసుగ్గా ప్రశ్నించాడు.

ముసలాయనకు అర్థం కాలేదు. దగ్గవచ్చి కంగారు పడ్డాడు. చివరకు-"పెద్దమ్మాయి - సీతమ్మ" అని మాత్రం అనగలిగాడు. ఆ అబ్బాయి నవ్వి నడిచి పోయాడు చూస్తుండగానే. తనుగూడా అతనివెంట నడచి సాగనంపి రావాలన్న చిన్న ఊహ గూడా ముసలాయనకు తట్టలేదు.

ఆయన యింట్లోకి మరలాడు. "దీపం జ్యోతి పరబ్రహ్మం, దీపేనా హరదే పాపం.'' ఆ ఇంట్లో చీకటి కనబడలేదు. ఎవరిగుండెల్లోనూ కుంపట్లు అసలు వున్నట్లేదు. ఒక్కటే వెలుగు. ఈ రోహిణి గూడా వసంతమయమై లోకానికి ఆహ్వాన గేయం పాడుతున్నది.

* * *

వివేకానందం వచ్చివెళ్ళిన మూడు రోజులకు ముసలాయన పేర ఒక భీమా చేసిన కవరు వచ్చింది. అందులో వందరూపాయలనోట్లు మూడు, ఒక చీటీవున్నయ్. "మా నాన్నగారు గూడా శ్రీ స్వామి వివేకానందులవారి శిష్యులు. అందువల్ల యీ స్వాతంత్ర్యం తీసుకుంటున్నా. ఇది పెళ్ళి ఖర్చులక్రింద. ఆడంబరాలు ఏ మాత్రమూ అక్కర్లేదు అవసరమైన నలుగుర్ని పిలిస్తేచాలు. నేనూ నలుగురితోనే తరలి వస్తున్నాను, ఒక్క విషయం - ఇందులో ఒక వంద రూపాయలు మాత్రం సీత చీరెలకు ప్రత్యేకించాలి. ఇప్పుడు తప్పితే మళ్ళీ సీతకు మంచి చీరెలు కొనే శక్తి, అదనూ నాకు లభిస్తవోలేదో—వివేకానందం."

ముసలాయన గుండె ఆనందంతో దడదడలాడి ఆగిపోయేనేమో ననిపించింది. ఈ అబ్బాయి, ఈ వివేకానందం అల్లుడుగాదు; మానవ మాత్రుడుగాదు; మేఘాలనుండి దిగి నడిచివచ్చిన దేవదూత.

ఆయన చేతులు వణకినవి. పార్వతివచ్చి ఆ ఉత్తరం ముక్కను పెద్దగా చదివింది.

"అక్కయ్యకు బనార్సిచీరె కావాలిట నాన్నగారూ!"

* * *

పెళ్ళి బహు నిరాడంబరంగా జరిగింది. సీత బనార్సిచీరె కట్టుకోలేదు గాని, లక్నో అంచులుకల నేత చీరె కొనిపించుకొన్నది. పెళ్ళిలో పెద్ద విశేషాలేమీ జరగలేదు. బావకూ అక్కకూ పూలదండలు కుట్టింది పార్వతి. తలంబ్రాలు అయింతర్వాత నూతన వధూవరులు దండలు మార్చుకొన్నారు. కాని,

వివేకానందం సీత మెడలో దండ వేస్తున్నప్పుడు అది పుటుక్కున తెగిపోయింది. ముసలాయన మనస్సు చివుక్కుమన్నది. అపరాధిని వలె పార్వతి బావవంక చూసింది. వివేకానందం ముఖభంగిమలో ఏ మార్పు కనిపించలేదు.

సీత కాపురానికి వెళ్ళింది. ముసలాయన గుండెలో కొత్త కుంపటి భగభగ రాజుకొన్నది.

* * *

స్వప్న దర్శనంతో యీ యింటికి వచ్చింది సీత. కాని, యీ యిల్లు మునికుటీరంవలె నిరాడంబరంగా, కఠిన తపోవాతావరణంతో నిండివున్నది. సీతకు అది లోపంగా కన్పించలేదు. ఒక్కటే ఒక్క పటం—శ్రీ వివేకానందుల ది - ఆ యింటి అలంకరణ, ఆ యింటి ఆభరణం.

ఆ రోజున వివేక్ చాలా ఆలస్యంగా యింటికి చేరాడు. సీత ఏడుస్తూ గడపలో కూర్చొని వున్నది. అతను వచ్చి ఆమె గడ్డంపుణికి తల నిమురుతూ గడపమీదనే చతికిలపడ్డాడు.

"ఇంత ఆలస్యంగా వచ్చారేం?"

వివేక్ ఆమె కళ్ళల్లోకి చూచాడు.

''మన పెళ్ళికి వున్న నాలుగు రాళ్ళూ ఖర్చయిపోయినై. నీకు సొమ్ములు చేయించాలని నాకు పట్టుకొంది. బంగారమంటే నాకు గౌరవంలేదు. కాని, నీ మెడ, చేతులు బోసిగాడుతున్నవి. మరి కష్టపడి పని చెయ్యకపోతే ఎట్లా?''

''నాకు సొమ్ములు వద్దు. మీరే నా సొమ్ము."

ఆమె ఏడ్పు మానినా, కృతజ్ఞతా బాష్పాలతో కళ్ళనుండి నీరు తిరిగి ప్రవహించసాగింది. వివేక్ తన చేతితో ఆమె కన్నీళ్ళద్దుకొని తన కళ్ళకు రాసుకొన్నాడు.

''ఏమి పనిది?'' ఆమె అతని చేతులు పట్టుకొన్నది.

''మన కోసమేగాదు—యీ డబ్బు. మీ ఇంటి సంగతి నాకు తెలుసు. పార్వతికి గూడా వెంటనే పెళ్ళి కాకపోతే మీ నాన్న హృదయం పగిలిపోతుంది. బతికినన్నాళ్ళు బతకపోడుగదా?"

సీత అతని కాళ్ళమీద తలవంచి అతని వేళ్ళను తడిపింది.

"లే, నావి దుమ్ముకాళ్ళు. నీళ్ళుతేడు."

సీతకు ఆ మాటలతో ఎక్కడలేనిశక్తి వచ్చింది.

వివేకానందం, ఏంపని చేస్తున్నదీ ఏ ఆఫీసులో వున్నదీ సీత ఎప్పుడూ అడగలేదు. అతను చెప్పలేదు. కాని, ఒకసారి అతనన్నాడు—''మహాకవి కాళిదాసు విక్రమోర్వశీయం నాటకాన్ని ఒక ప్రార్థనతో ముగించాడు - సరస్వతికి-లక్ష్మికీ ఐకమత్యం పొసగాలని. కాని, ఆ తగాదాకు అంతం కన్పించడంలేదు—" ఏ సందర్భంలో యీ ప్రస్తావన వచ్చిందో ఆమెకు జ్ఞాపకంలేదు. కాని అతడు ఏదో పత్రికా కార్యాలయంలో పనిచేస్తున్నట్లుగా ఆమె ఊహించింది.

అతని నిరాడంబరత ఆమెకొక్కోసారి విసుగు పుట్టించేది-

''ఎప్పుడూ యీ తెల్లచొక్కాలే కుట్టించుకొంటారు. ఎన్ని మంచి మంచి గళ్ళ గుడ్డలు రావటంలేదు?''

"ఇంకా నయం. తెలుపులో తప్పు లేదు. కాని, నిన్ను చూసి వుండకపోతే కాషాయాన్ని ధరించివుండేవాడినేమో!"

''రామ! రామ! ఇట్లాంటి మాటలనకండి నేను బతికుండగా."

అతను నెమ్మదిగా ఆమె నోరు నొక్కి ''నువ్వు ఇట్లాంటి ఒట్లు పెట్టుకోగూడదు - తెలిసిందా?'' అన్నాడు గట్టిగా.

సీత పుట్టింటికి పోయివస్తానని ఎప్పుడూ అడగలేదు. అతనికి ఆహ్వానమూ రాలేదు. వారానికొకసారి మాత్రం నాన్నగారి చిరునామా వ్రాయమని ఆమె అతనికి కార్డు అందించేది.

మొదటి సంవత్సరం అతనే అడిగాడు—

''మీ యింటికివెళ్ళి చూసి వస్తావా?''

ఆమె అతనివంక ఒక క్షణం దృష్టినిలిపింది.

''నా యిల్లేనా? మీ యిల్లుకాదూ?''

అతను ముక్తసరిగా సమాధానం చెప్పాడు:

''నాకు తెలుసు.''

ఒకసారి ముసలాయనే కూతురుకొక చీరె, అల్లుడికొక నేతధోవతుల జత పట్టుకు వచ్చాడు. ఆయన తిరిగి వెళ్ళేటప్పుడు వివేక్ రెండు జతల పంచలు, చొక్కాలు, వుత్తరీయాలు, పార్వతికి చీరకొని అట్టపెట్టెలో పెట్టి చేతికందించాడు.

ఆ మరు సంవత్సరం ఆమె అన్నది—

''పార్వతినొకసారి పంపించమనిరాయండి. పదిరోజులుండి పోతుంది.''

పార్వతిని స్టేషన్నుండి అతనే బండిలో తీసుకు వచ్చాడు.

''ఇల్లు ఎంత సందడయిందో చూడండి'' అని ఆమె అన్నది సంతోషంతో.

''అవును, నీకు కొడుకు పుట్టిన రోజునుంచీ పైకప్పు గూడా ఎగిరి పోతుంది.''

అప్పటికి వాళ్ళ పెళ్ళయి మూడేండ్లు నిండినాయ్.

మళ్ళీ శుక్లపక్షం రాగానే పార్వతి వెళ్తానని పట్టుబట్టింది.

''నాన్నకు యీ వర్షాల్లో ఉబ్బసం వస్తుంది. ఆయన ఎట్లా వండుకుంటు న్నాడో యేమో! రేపు దాని ప్రయాణం సంగతి చూడండి'' అని ఆమె భర్త అరుగుమీదినుంచి లేస్తూండగా అడిగింది.

''సింగ డద్దంకి వెళ్ళాడు - వచ్చాడు అన్నట్లుగా వుంది.''

''మరి దానికింకేమి గావాలి? మీ వంటి ఉత్తముడైన భర్త దొరకాలి'' అని సీత కన్నీళ్ళతో అతని హాస్యానికి జవాబు చెప్పింది.

తనకు జ్ఞానోదయమైనట్లుగా వివేక్ పార్వతివంక చూచినాడు. పార్వతిని కన్నీళ్ళతో చూడటం అతనికదే ప్రథమం. ఆమె కన్నీళ్ళు తుడుద్దామని అతను ఆమె దగ్గిరగా వెళ్ళాడు. సందేహించాడు. అప్పటికే ఆమె అక్క భుజంమీద వాలి ఓదార్చబడుతున్నది. అతనికి అర్థం కాలేదు. కృతులు పాడమనగానే కమ్మని కంఠంతో పాడే పార్వతి, తన చొక్కాలన్నింటికీ రంగుదారాలతో 'వి' మార్కు కుట్టిన పార్వతి, పెద్ద కళ్ళతో లోకాన్నంతా చూసి తనకేమీ పట్టనట్లుగావున్న పార్వతి.... యీ పార్వతిలోనా అగ్నిపర్వతం! అతడు ఏమని ఎట్లా ఓదార్చాలి?

''పార్వతికేం, చక్కనిపిల్ల. సంగీతం, సాహిత్యం, లలితకళలు, గృహ కృత్యాలు నేర్చిన పిల్ల. చక్కని పిల్లవాడొచ్చి చేసుకొంటాడు.''

అబద్ధం - అబద్ధం! అతని పెదిమలను హృదయం హెచ్చరించింది. అంతా అబద్ధం. సర్వం అసత్యం! ఈ లోకంలో వివేకానందుడి శాసనాలూ వీరేశలింగంగారి న్యాయాధిపతులు పుట్టి బతకలేరు. అతడు మానవుడి సాంఘిక వాతావరణాన్ని ''సమాజం'' అని ఎప్పుడూ సంబోధించడు. వివేకానందుడి శాసనాలు మానవుల్లో కొత్త జాగృత్తిని నెలకొల్పినప్పుడే - యీ లోకం మానవ సమాజం, నాగరికతా చిహ్నం అవుతుందంటాడు. ఈ భావాలు అతను సీతతో

చెప్పాడని కాదు- అతను చీటీమీద వ్రాసుకొన్న కొన్ని పాయింట్లు ఆమే ఒకసారి చూసింది. చివరకు ఆ చీటీ దినచర్యల పుస్తకంలో కెక్కుతుంది

మర్నాడు పార్వతి ప్రయాణానికి ఆ రాత్రే సీత అన్నీ సర్దింది. మర్నాటి మధ్యాహ్నానికి వీధిలో బండి ఉంటుంది.

సీత వంటింటి సర్దుడులో నిమగ్నయైవున్నది. బావామరదళ్ళు ఆరుబయట- ఒకరు మంచంమీద, ఒకరు అరుగుమీద - నిశ్శబ్దమూర్తులుగా కూర్చొని వున్నారు.

''పార్వతీ, మీ అక్క పెళ్ళికి పూలమాలలు కట్టిందెవరు?''

శుక్లపక్షమి పంచమినాటి చంద్రదేగాని మబ్బుల మధ్యనుండి మసకగా వెలుగుతున్నాడు.

పార్వతి ఒక్కసారి ఆశ్చర్యచకితురాలైంది. తనను పాట పాడమనటం కన్నా ఏ క్లిష్ట ప్రశ్ననూ బావ వేసి యెరగడు.

''నేనే బావా ...!''

ఆ సమాధానం చెప్పిన మరుక్షణమే పార్వతికి అక్క పెళ్ళినాటి సంఘటన గిర్రున మెదడులో మెదిలి, నయనయుగ్మంముందు మెరిసింది. ఆమె భయ కంపితురాలైపోయింది. ఆ మూగవెన్నెల గూడా భయానక నిశిలాగా తోచింది. కాలమే స్థంభించిపోయినట్లయింది

ఆ యిరువురిమధ్యా నిశ్శబ్దమే ఒక వాహిని. నిశ్శబ్దమే ఒక అఖాతం. ఆ సంభాషణ చంపటానికి యిరువురికీ తాహతు లేదు. ఆ సంభాషణ పొడిగించటానికి యిరువురికీ ధైర్యం లేదు. లావా వెదజిమ్ముతూన్న అగ్నిపర్వత శిఖరంమీద పెద్దబండరాయిని కప్పినట్లయినది. కాలంమూలిగింది. మ్రూల్గి తిరిగి స్తంభించింది.

"పారూ, ఆ కృతి మళ్ళీ పాడగలవా?''

ఆమె కప్పటికిగాని చైతన్యం రాలేదు.

"ఏ కృతి బావా?''

''కోటినదులు.... ధనుష్కోటిలోనుండగా.''

తిరిగి ఒక్క క్షణం ఆమె నిరుత్తరురాలైంది. ఆమె కంఠం రుద్ధమైపోయింది.

''బా....వా....!''

"............ "

"బావా, పాడతానుగాని ఎందుకా ప్రశ్న వేశావ్?"

"ఏ ప్రశ్న?"

"పూలమాలలు సంగతి."

"అవును పారూ! నువ్వు కట్టిన దండల్లో ఒక్కటే గట్టిది."

గుడిలో గంటలు గణగణ మోగినవి. గుండెలో మంటలు భగభగ మండినవి. చంద్రుడు బొత్తిగా మూసుకుపోయాడు. హోరున గాలి వీచింది. ఆ హోరులోనుండి లోకపు విషాదమంతా మూగ సంగీతమై వినవచ్చింది.

పార్వతి త్యాగరాజకీర్తనకై గొంతెత్తింది. కాని, అది యిందాకటి రాగంతో కాదు.

"వద్దులే పారూ, వద్దులే."

కాని, ఆమె ఆపలేదు. అతడు మంత్రముగ్ధుడివలె అచంచలుడై కూర్చుని విన్నాడు. ఆ చీకటిలోనుండి అతడి కంఠం మాత్రమే వినిపించింది - చివరకు.

"పారూ, మీ అక్కనుగాదు నేను మొదట చూసింది మీ యింట్లో; నిన్ను!"

పార్వతి ముఖరీతి, హృదయగతి - ఆ చీకటిలో, ఆ మానవాక్షులకు కనబడవు.

వివేక్ గిరుక్కున అరుగుమీదినుంచి కిందకు ఉరికాడు. గడపలో సీత నుంచొనివుండటం అతనికి కన్పించింది.

"పార్వతి రేపు పోదు. నువ్వేమీ హడావిడి ప్రయత్నాలు చెయ్యక్కర్లేదు...." అని అతడు భార్య ముఖం చూడకుండానే అన్నాడు.

* * *

కాని, పార్వతి ప్రయాణం 'రేపే' సాగింది. పార్వతేగాదు, విధిబలం ఇంటిల్లిపాదినీ 'రేపటి' ప్రయాణానికి కదిలించింది. ముసలాయన చనిపోయాడని తంతివార్త వచ్చింది.

తంతి చదువుకొని ఎవ్వరూ ఏడవలేదు. కాని, ప్రయాణానికి అందరూ ఎవరికివారుగా సన్నద్ధులైనారు. వివేకానందం పార్వతిని ఓదార్చే ప్రయత్నమే చెయ్యలేదు. సీతను మాత్రం రెండు మూడు సార్లు భుజంమీద చెయ్యివేసో, ముంగురులు సర్దో ఓదార్చబోయాడు. కాని, ఆమె నిశ్చేష్టితావస్థలో స్పర్శజ్ఞానమే

పోగొట్టుకొన్నట్లుగా ప్రవర్తించింది. పార్వతి వివేక్‌వంకకే దృష్టి మరల్చలేదు. కాని, బండిలోకెక్కుతున్నప్పుడు సీత భర్తను విడిగా పిలిచి ఒక ప్రశ్నవేసింది.

"మీరు పార్వతికి నాలుగు ధైర్యపుముక్కలైనా చెప్పరేమిటి?''

వివేక్ తన గుండెమీద చెయ్యిపెట్టి భార్యకు చూపించాడు. ఆ బరువును కొలిచే యంత్రాలు మానవుడు యింతవరకూ సృష్టించలేదు. ఆ లోతును చూడగల గాలాన్ని మానవుడి మేధస్సు వూహించనుగూడా వూహించలేదు.

రైలు పెట్టెలో సీతకూ, బావకూ ఎదురుగా కూర్చున్నది పార్వతి. అప్పుడూ ఆమె ఎవరివంకా చూడలేదు. వివేక్ భార్య ప్రశ్నకు ఆ సమయంలో సమాధానం చెప్పాడు ... "పార్వతికి నేను గార్డియన్‌ను. ఓదార్పు మాటలతో నా బాధ్యత తీర్చుకోనా?''

సీత కృతజ్ఞతతో అతనివంక చూసింది. అతడు హాలాహలం మింగి దేవతాలోకాన్ని రక్షిస్తున్న రుద్రుడివలె ఇక మాట్లాడలేదు.

నాన్న నిర్గమనంతో తమ గ్రామజీవితంలో తీర్చలేని పెద్ద లోపం ఏర్పడి వుంటుందనీ, అసలు ఆ క్షణాన్నుండి కాలం ముందుకే కదలదనీ సీత రైలు ప్రయాణపు తలపుల్లో అనుకొన్నది. కాని, తీరా వచ్చి చూస్తే మామయ్య తప్పితే ఆ యింటి ముందు మరొక నరుడు కన్పించలేదు. సీత గ్రామ వీధులన్నింటినీ దుఃఖభారంతో వాచి ఎర్రవైన కళ్ళతో పరికించి చూసింది. అవే వీధులు. అవే గోడలు. ఆ గోడలనుండి తలలెత్తి తమను తిలకిస్తున్న ఆ పాత చెట్లే ఈ గోడలు వెలవెలలాడటం లేదు. తలలు విరియబోసుకొని నూత్న వితంతువువలె యీ చెట్లు ఏడ్వటంలేదేమి? తన పెండ్లయి అత్తవారింటికి వెళ్ళేముందు గూడా యీ గ్రామపు పవనగతిలో మందగమనం ఏర్పడుతుందని సీత ఒక విధంగా ఆశించింది. తమ యింట్లో తను పుట్టిమెట్టిన యింట్లో తప్పితే - ఆ గ్రామానికి తన రాకడ - పోకడ ఒక ప్రధాన సమస్య గాదు. ఇంతేనా?

వివేకానందం తన జేబులోనుండి నోట్లు తీసిన తరవాతనే అక్కడ నలుగురూ పోగైంది. ఆతర్వాతనే పాడెకు కావలసిన బొంగులు, గోగునారకట్ట ఎక్కడినుంచో దూకినట్లుగా వచ్చిపడ్డవి. శవదహన క్రియలయ్యేప్పటికి రాత్రి పది దాటింది. చివరకు యింటికివచ్చి చేరేసరికి సీతనుగాని, పార్వతినిగాని ఓదార్చి నాలుగు మెతుకులు వండటానికిగూడా ఒక్క ఆడపురుగు కనపడలేదు.

అతని చుట్టూ తిరిగి పురోహితుడు మాత్రం రాత్రి పొద్దుపోయిందాకా మాట్లాడుతూ కూర్చున్నాడు.

వివేకానందం భార్యతో అన్నాడు - ''నువ్వు దిగులు పడవలసిన విషయం కాదు. సమాజం అనేది పదిమంది ఉన్నతాశయాలుగల వాళ్ళ సమష్టి ఆత్మ గాదు. పదిమంది స్వలాభపరులు, ఆత్మలేనివాళ్ళు మిగతా పదిమందిలో ఒకడి కష్టసుఖాలమీద చేసే అర్థంలేని విమర్శకు మిగతా తొమ్మిదిమంది చేసేదిలేక తలలూపి పొందే భయంయొక్క కనబడని స్వరూపం మాత్రమే. మీ నాన్న గూడా నాలుగు రాళ్ళు వెనకేసి వున్నట్లయితే గ్రామమంతా మీ వాకిలిముందు పడిగాపులు గాచి వుండేది. ఇంతకూ యింట్లో వస్తువులన్నీ సరిగ్గా వున్నయ్యేమో చూశావా?"

"అమాటే మీతో అందామని నోటిదాకా వచ్చింది. మా బామ్మ దక్షిణాది నుంచి తెప్పించిన పెద్ద గంగాళమూ, మన పెళ్ళిలో మీ కాళ్ళకు తగిలిన రాగి కాగూ కన్పించటంలేదు."

''సమాజం'' అన్నాడు వివేక్.

ఆ రోజున రెండు మూడుసార్లు పార్వతిని పలకరించేందుకు అతడు ప్రయత్నించాడు. కాని, యిద్దరికీ మాటలు పెకిలి రాలేదు. ఆ రోజున చిన్న కర్మ మొదలుపెట్టాలి. పురోహితుడికోసం చూస్తూ వివేక్ మంచంమీద గోడవారగా నడుం వాల్చాడు.

సీతవచ్చి ''ఏమిటి లోలోపల నవ్వుకొంటున్నారు.?'' అని హఠాత్తుగా ప్రశ్నించింది.

అతను వులిక్కి పడ్డాడు—''నిజమా? వేళాకోళమా?''

సీత ముగించింది—"వేదాంతులకు పుట్టెడు దుఃఖంలోగూడా చిరునవ్వు వస్తుందిట.''

ఆ మాట కలుక్కుమని అతనికి తగిలింది వెన్నెముకలో. నిజమేనా? తను నవ్వుతున్నాడా? ఎందుకు? కాని ఏదో అదృశ్యమైన, అపురూపమైన నిరర్థక వేదాంతమేదీ తనను పిశాచిగా ఆవహించలేదుకదా! లేదు. సత్రంపక్క చెరువు గట్టుమీద పురోహితుడు మంత్రాలు వల్లిస్తుండగా పరలోక గతుడైన మామగారు గాక, తన సీత, మరదలు అతనికి జ్ఞాపికి వచ్చారు. ఏదో శక్తి అతని రక్తంలో

కొత్తబలంతో ప్రసరించినట్లయింది. ఈ పార్వతికి నిజంగా తను గార్డియన్ కాబోతున్నాడు. సంరక్షకుడు. తల్లి. తండ్రి. బావ. ఆమె భవిష్యత్తంతా తన శక్తి సామర్థ్యాలమీద, దయాధర్మాలమీద ఆధారపడి వుంది. అవునా? కాదా?

ఫోంచేసిం తర్వాత సీతవచ్చి అతని కాళ్ళవద్ద కూర్చున్నది.

"మీరు దైవసమానులు."

''అవును—కాదు.''

''కాదేమిటి? అవును. ఈ చుట్టూ లోకాన్నంతా చూడండి. హృదయం వున్నదేమో చెప్పండి.''

''లోకం మానవుని సమష్టి ఆత్మ కాదని చెప్పాను. దాన్నిగురించి నీకెందుకు బెంగ?''

ఆ ఉద్బోధ నచ్చినట్లుగా సీత కొంచెంసేపు మాట్లాడలేదు.

"పారు మనతో రానంటున్నది. నాన్నవారి యిల్లని వున్నపుడు యింకెక్కడో వుండాల్సిన గతి తన కేమంటున్నది?''

వివేక్ భయాశ్చర్యాలతో ఆమె వంక చూచాడు. పొంగి చల్లారిన పాలవలె అతని ముఖం తెల్లబడిపోయింది. అతను ఒక్కదూకుతో మంచంమీదినుంచి లేచాడు. గబగబా పార్వతిని వెతుకుతూ లోపలకు వెళ్ళాడు. పార్వతి చాప మీద కూర్చుని నాన్నగారి పాత రికార్డులు తిరగేస్తున్నది.

''మీ నాన్నగారి యిల్లు - ఒకరికి తెలీకుండా మరొకరికి ముగ్గురి తాకట్టులో వున్నది.''

పార్వతి బావవంక చూసింది.

"ఎవరన్నారు?''

''ఎవరో ఎందుకంటారు? ఆ ముగ్గురూ నాకు తాకట్టు దస్తావేజులు చూపించారు.''

"నేను నమ్మను."

"నేను నమ్మాను.''

''అయితే నన్నేం చెయ్యమంటారు?''

''ఇక్కడుంటటానికి వీల్లేదు. ఇక్కడుండి చెయ్యగలిగిందీ ఏమీ లేదు. మాతోపాటు మా యింటికి రావాలి. అదీ నీ సొంతయిల్లే.''

పార్వతి వెక్కివెక్కి ఏడ్చింది.

''బావా! నీ పెళ్ళికి తెగిపోయిన పూల దండలు కట్టినదాన్ని - నన్ను ఆహ్వానిస్తున్నావా?''

పాము కాటువలె యీ పూలదండ మాటకు వివేక్ ఒక్క అడుగు వెనుకకు వెళ్ళాడు. అతని కళ్ళు చీకట్లు కమ్మినవి. మెదడు అర్థం, గమ్యంలేని అరాచక వేగంతో పరుగులు తీసింది. ఆనాటి పూలదండ నాగుపామువలె పడగలెత్తి అతని కళ్ళముందు ఫణంవిప్పి ఆడసాగింది. నాగసర్పం వూదుతున్న పాములవాడివలె పార్వతి కూర్చునివున్నది. అతడు యీ భ్రమనుండి బయటపడేసరికి ఎంత కాలమైందో వూహించలేదు.

''నీ బట్టలన్నీ మీ అక్క సర్దుతున్నది. ఇవ్వాళ సాయంత్రమే మన ప్రయాణం'' అని వివేక్ అక్కడినుండి కదిలిపోయాడు.

* * *

ఇంటికి వచ్చిన వారం నుండీ పార్వతికి పెళ్ళి సంబంధాల కోసం వివేక్ ప్రయత్నాలు ప్రారంభించాడు.

''నాన్నగారి ఏడూరు వెళ్ళందే శుభ కార్యం ఎట్లా తలపెడతారు?'' అని సీత అడిగింది.

ఆ మాటవిని అతను తన ప్రయత్నాల్ని మందగించేశాడు. అనుకొన్నంత సేపు పట్టలేదు సంవత్సరం గిర్రున తిరిగి పోవటానికి. ఈ సంవత్సరంలో మామయ్య ఒకటి రెండుసార్లు వచ్చాడు. పార్వతి పెళ్ళి విషయం హెచ్చరించాడేగాని, ఆ పిల్లను తనతో తీసుకువెళ్తానని మాట కూడా అనలేదు. అనలేదని సీత నొచ్చుకొన్నది. అంటాడేమోనని వివేకం భయపడ్డాడు. పార్వతి ఆ యింటి హృదయమైపోయింది.

కాని, తన విలువను తాను బావ జబ్బుపడ్డప్పుడుగాని గ్రహించలేక పోయింది.

ఆనాటి సాయంత్రంవరకూ వివేకం ఆరోగ్యంగా తిరుగుతునేవున్నాడు. మామూలుగా సాయంత్రం ఆరింటికల్లా యింటికొచ్చి, తిరిగి పైన వుత్తరీయం వేసుకెళ్ళి పది గంటలకుగాని ఇంటిపట్టు చేరలేదు. వస్తూనే తలకాయనొప్పని

పక్కవేశాడు. సీత, బలవంతాన వేడినీళ్ళు తోడి పోసుకొమ్మని, ఆ తర్వాత యింత ఎంగిలి చేయించింది. అతను ఆవేదనలో ఉన్నాడు. నిద్రపట్టలేదు.

''పార్వతీ - పాట పాడగలవా?'' అని అడిగాడు.

''ఏ పాట?''

''ఆ ప్రశ్నకు అర్థంలేదు.''

''మరి—''

''పాడు.''

మామూలు పరిస్థితుల్లోనయితే ఆ ''పాడు'' నుండి ''ఏంపాడు?'' దాన్నుండి ''గరికిపాడు'', తర్వాత ''ఏమి గరికి?'' అలా కొండవీటి చేంతాడు వంటి బాల మీమాంస చెలరేగేది. కాని, పార్వతికి ''పాడు'' భయాతిరేకమై వినవచ్చింది ఆమె భయపడి వళ్ళు విదిలించింది.

ఒక్కక్షణమే ఆ గగుర్పాటు నుండి భయంకర నిశ్శబ్దం కాలాన్ని పొడిగించింది. వివేకం ఆ పక్కకు తిరిగి కళ్లుమూసుకొని ఉన్నాడు.

ఆమె ప్రయత్నం చేయకుండానే గొంతునుండి ''కోటినదులు ధనుష్కోటిలో కలియగ -'' పెల్లుబికి వచ్చింది. అతడు ఒక పార్శ్వం నుండి మరొక పార్శ్వానికి పొర్లాడు.

''పార్వతీ, ఆ పాటే'' అని తనలో తానుగా గొణిగాడు.

పార్వతి మళ్ళీ జలదరించింది. తనెందుకు పాడిందాపాట? ఒకసారి బావ అడిగిన పాట అనా? అందులో దాగి ఏదో మహత్తర సత్యమున్నదా? ఆమె ఆలోచనలు పరుగులెత్తుతున్నా పాట ఆపలేదు. మధ్యలో అతను దీపం దూరంగా పెట్టమన్నాడు. ఆమెను గూడా క్రీనీడలో కూర్చొని పాట సాగించమన్నాడు. ఆమె కదలలేదుగాని క్రీనీడ ఆమెను తనలో కలుపుకొన్నది.

''పారూ, ప్రతి స్వల్ప విషయం వెనుక గూడా ఒక మహత్తర సత్యం వుండి ఉంటుంది. ఈ జీవితపు వెనుక తెరలో దాని రహస్యం యిమిడి ఉండదా మరి? ఆ పరమ సత్యం కనుగొన్నదాకానే మానవుడి మనఃపరితాపం. ఆ 'కనుగొనటమే' ముక్తిసాధన. దాని తర్వాత మానవుడే పరమాత్మ. పరమాత్మే మానవుడు. నువ్వు యీ సంగీతం నుండి ఆ రహస్యాన్ని గ్రహించగలవ్ పారూ! త్యాగరాజు త్యాగబ్రహ్మగా యీ మార్గంనుండే మారినాడు గదా?''

ఆమె పాట అయిపోయింది గనుక యింవాక అతను వేలుచూపిన దూరంలో వెళ్ళి కూర్చున్నది. ఇంతసేపూ కాళ్ళకట్టన కూర్చుండి సీత అతని పాదాలు ఒత్తుతున్నది. అతను తిరిగి మాట్లాడాడు.

''పారూ, మీ అక్కకు సంగీతం రాదు.''

''అక్కయ్యకు నా కంటె బాగావచ్చు. మీరెప్పుడైనా పాడమంటేగదా?"

''పాడమను.''

ఆమె అనలేదు. సీత అతని కాళ్లు మెల్లగా దిండుమీద వుంచింది.

''మీరు పాడమంటే-'' అన్నది.

''పాడు''

'ఏ పాట?''

''ఇంకో పాటెందుకు? పారు పాడిన పాట వెనుక సత్యాన్ని పాడు.''

ఆమె నీలనాగినివలె గొంతు బహు సున్నితంగా కదిలించింది. ఆ కదలికకు గది నలుమూలలా మృదువైన శబ్దపు అలలు క్షణంలో విద్యుత్‌వలె ప్రసరించినవి. ఆ గది మృత్యు నిశ్శబ్దమైపోయినది. అతడి ఏ అవయవమూ కించిత్తు గూడా చలించలేదు. దీపంగూడా ఆ శబ్దతరంగాల జోలకు అలసి నిద్రించినట్లుగా మూగ కిరణాలను ముడుచుకొన్నది. ఆమె గొంతు ఏ చరణం లోనూ హెచ్చుస్థాయి నందుకోలేదు. వెన్నపూసనుంచి ఊర్వశి కుటిల కుంతలపు కొస బయటకువచ్చినట్లు సంగీత నిస్వనాలు ఆ గదిలోని చరాచరములను బంధించి వేసినవి. ఆ మధురగీతిక వెయ్యేళ్ళు ఆ బంధనాలను తీసివేయదు.

వివేకం సీతనెప్పుడూ పాడమనలేదు. అది మొదటిసారి. కాని ''ఇది చివరిసారి'' అని ఆమె గొంతుక నాపగానే ఆ గదినుండి ఎవరో అదృశ్యమూర్తి మారుపలికినట్లయింది. ఆ అమంగళ వాక్యానికి మిగిలిన యిద్దరూ ఉలికిపడి తుళ్ళిపోయారు సీత కళ్ళవెంట నీరు కారుతున్నది. దీపం హెచ్చు కాంతితో తనంతటతానుగా వెలిగింది. గదిలో ఎవరూ నోరు కదపలేదు. కాని, నలుమూలల నుండి ప్రతిధ్వనులు వినవస్తున్నవి.

అతడు హఠాత్తుగా మంచం మీద లేచి కూర్చొన్నాడు. దీపపుకాంతిలో అతడు సీత ముఖం వింతగా పరిశీలించాడు. ఆమె జడను మాత్రమే అతడు స్పృశించాడు. ఆ తర్వాత పార్వతివంకకు దృక్కులు మరల్చాడు - ఒక్క ఘడియ.

చివరి కతడు దీపాన్ని చూస్తూ అన్నాడు—

"పార్వతిగాదు ఆ పరమ సత్యాన్ని గ్రహించేది. సీత ఏనాడో గ్రహించింది. నేను మూర్ఖుణ్ణి."

అక్కా చెల్లెల్లు ఒకరి నొకరు చూసుకొన్నారు. ఆ కన్నులనుండి వాళ్ళ తల్లి రక్తం దృశ్యరూపమై మాట్లాడినది.

అతడు మంచం మీద తిరిగి వాలిపోయాడు. సీత అతని లలాటాన్ని స్పృశించింది. వెయ్యి ఇనుప కొలుముల వేడిని ఆమె హస్తనరాలు స్పర్శాజ్ఞానంతో కొలిచినవి. అతడి కన్నుల వెంట నీరు కారుతున్నది. వివేక్ సన్నిపాత జ్వరానికదే మొదలు

*　　　　*　　　　*

రెండవ రోజున వివేక్ జ్వరం హెచ్చు తగ్గులుగా అట్లాగే నిలిచివున్నది. ఉదయం మాత్రమే అతని ముఖం కళకళలాడేది. ఆ తర్వాత బారెడు పొద్దెక్కినప్పటినుంచీ మత్తుగా, పేలిపోతున్న జ్వరం తీవ్రతలో పడి వుండేవాడు.

సీత మూడవ రోజున వైద్యుణ్ణి పిలిపించింది. కాని, ససేమిరా- అతడు వద్దన్నాడు. చివరకు చెయ్యెత్తి నాడీపరీక్షకు కూడా అందించలేదు. సీత భయంకరమైన తలంపులతో వణికిపోయింది. ఆమె యింటిపని పార్వతికి అప్పగించి, తను ఇరవైనాలుగు గంటలు భర్తపక్కనే పరిచర్యలు చేస్తూ కూర్చున్నది. కాని, ఆమె పరిచర్యలను గూడా అతడు నిరాకరించాడు.

ఐదవ దినానగూడా నిషామత్తులో వేరొక లోకంలో విహరిస్తున్న వాడివలె - ఆ పగలంతా పడివున్నాడు. ఆ సాయంత్రానికిగాని అతడికి తెలివి రాలేదు. కళ్ళు తెరచి ఎర్రగా అతడు సీతవంక చూశాడు. బలహీనంగా, గోగుపుల్లగా మారిన తన ముంజేతినెత్తి ఆమె ముఖాన కుంకుమ బొట్టును తాకి తిరిగి తన నొసటికద్దుకున్నాడు. ఆమె అతనిని నెమ్మదిగా వారించబోయింది. వలవలా ఏడ్చింది

"సీతా, అంత పెద్దబొట్టు పెట్టుకున్నావేం?" అని అతను ఓపికగా చిరునవ్వుతో ప్రశ్నించి, ఆమె నయన యుగ్మంలోని అందరాని లోతులలో మునిగిపోయాడు.

ఆమె గుండెలు బాదుకుంటూ - ''అట్లాంటి ప్రశ్నలడగకండి. అసలే నాకు భయం వేస్తున్నది. ఇదేంఖర్మ చెప్పండి. చక్కగా తిరుగుతున్నవాళ్లు', అని వాపోయింది,

''నీ బొట్టులో నీ హృదయం, నువ్వు కనుగొన్న నీ జీవిత సత్యం, నీ ముక్తిమార్గం వున్నై సీతా!''

ఇక అతను మాటాడలేక తిరిగి కళ్లుమూశాడు. సీత తడిగుడ్డల పేలికలు అతని నుదుటిమీద వేసి జ్వరతీవ్రతను తగ్గించ ప్రయత్నించింది.

పది నిముషాల్లో అతను తిరిగి కళ్ళు తెరిచి ''పార్వతేది సీతా?'' అన్నాడు. సీత అక్కడ కూర్చునే పార్వతిని కేకేసింది లోపల్నుండి జవాబు రాలేదు. ఆమే స్వయంగా చూడబోయింది. పార్వతి లేదు! ఆమెకేమీ పాలు పోలేదు. వివేకం తిరిగి హీనస్వరంతో మాట్లాడాడు - ''పార్వతి యింట్లో లేదు. బహుశా డాక్టరు కోసం పోయివుంటుంది'' అని భార్యను చూడకనే అన్నాడు. ఆమె ఆశ్చర్యంగా అతనివంక చూసింది. ఆ రోజు ఉదయంనుంచీ తను భర్త మంచంవద్దనే వున్నది. భర్త మత్తుగా పడివున్నాడు, పార్వతి ఎటు వెళ్ళిందో తనుగూడా గమనించలేదు. మరి తన భర్త ఎట్లా ఊహించాడు?

మరొక్క క్షణంలో పార్వతి డాక్టరును వెంటబెట్టుకొని లోనికి ప్రవేశించింది. సీత లేవబోతుంటే అతను ఆమె చెయ్యిపట్టుకొని తిరిగి కూర్చోబెట్టాడు.

''మా పార్వతి మీకు అనవసశ్రమ కలిగించింది. నేనేమో మందులుతాగే రోగినిగాదు. మీ ఫీజుతీసుకొని తమరు వెళ్ళాలని కోరుతున్నాను.''

డాక్టరు ముగ్గురివంకా కొరకొర చూశాడు. పార్వతి నోరు తెరచి ఏదో అనబోయింది కాని, బావముఖాన్ని చూడగనే ఆమెకు మాట పెగిలిరాలేదు.

ప్రజాపీడనకు మొదనుండీ అలవాటుపడిన డాక్టరుగారికి యీ అవమానం పట్టలేదు. గిరుక్కున తిరిగి వాకిలిదాకా నడిచి, మళ్ళీ వెనుకకు వచ్చి - "ఫీజ్" అన్నాడు. రోగాలూ, అజ్ఞానమూ రోడ్డుదుమ్ములాగా దొరికే యీ దేశంలో ధనార్జనే ప్రధానమైన డాక్టర్ల దౌర్జన్యానికి కళ్ళెం ఎక్కడుంటుంది? తన దిండు పక్కనే పడివున్న పర్సుతీసి అతడు పార్వతి కందించాడు. పార్వతి నోటు బయటకు తీయగనే ఆమె చేతినుండి ఊడబెరుకుకొని డాక్టరు తిరిగి చూడక సాగిపోయాడు.

గదిలో పది క్షణాలు నిశ్శబ్దదేవత రాజ్యం నెలకొన్నది. లోతులేని పటాటోపపు అత్మ హృదయాలకు శబ్దమూ, కోపమూ అర్థయుక్తంగా గోచరిస్తవి. కాని, యీ నిశ్శబ్దంలో పటుతరమైన శక్తి దాగివున్నది. ఈ నిశ్శబ్దంలో కానరాని బలీయమైన అధికారం వున్నది. అతడు మాట్లాడినాడా - వ్యధితుడై మరుపక పోయినా మాటలకందని స్వప్నదృశ్యాలను గవేషిస్తున్న స్వప్నదర్శి గోచరిస్తాడు. అతడు మాట్లాడ నిరాకరించాడా - పరచుకొని విస్తారమైన రాత్రి భయంకరవేదన పొదగట్టుతుంది. ఒక వాక్యంలో అజేయత పాదరసంవలె ప్రసరిస్తుంది. ఒక వాక్యంలో వ్యధ చీకటిగా ప్రవహిస్తుంది. ప్రతి క్షణమూ అర్థయుక్తమై సాగిపోతున్నది.

ఇక మాట్లాడకనే అతను అలసిపోయాడు. అతని కన్నులు మూతలు పడ్డవి సీత అతనిని తట్టి ముక్కుదగ్గర వేలుంచి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు పరీక్షించింది. అతడు కళ్ళు తెరవకనే దీర్ఘంగా నిశ్వసించాడు-ఆమె తృప్తికోసం.

పడమటింటి కిటికీలో కూర్చొని పార్వతి ఏడుస్తున్నది. సీతవెళ్ళి ఆమె కళ్ళుతన పమిటెచెంగుతో తుడిచింది.

"బావ పర్సులో ఎంత డబ్బున్నదో చూశావా?"

చూడలేదన్నట్లు తల వూపింది సీత.

పార్వతి తనచేతులు చాచి వేళ్ళుచూపింది - పది అన్న అర్థంగా. సీతకది గొప్పవిషయంగా కనబడలేదు. ఆమె కట్టెలుకొట్టుతూ పడిపోయిన సత్యవంతుడి శవాన్ని తనభర్త పక్కమీద చూచి వచ్చింది. తను సావిత్రిననే నమ్మకం తిరిగి స్మృతిలో ఆవరించి, గబగబా భర్తవద్దకు వెళ్ళి కూచుంది. ఏ యముడి పాశాలూ తన సన్నిధిలో అతనిని తాకలేవు. తన సన్నిధిలో తన భర్తకు మృత్యువు లేదు.

* * *

వివేకం ఎక్కడ పని చేస్తున్నాడో సీతకు తెలియదు. తమది విచిత్ర దాంపత్యమనిః ఈ కారణం చేత ఆమె ఎప్పుడూ తలచలేదు. అతడు తనభర్త. తను అతని అర్ధాంగి.

ఆ మర్నాడు అతడు బహు నీరసంగా వున్నాడు. బారెడు పొద్దయినా ఎక్కలేదు.

"నాకెవరైనా విసరాలి" అని ఎవరివంకా చూడకుండానే అడిగాడు.

సీత తాటియాకుల విసనకర్రతెచ్చి అతని పక్కనే కూర్చొనబోయింది. ''నువ్వుగాదు, పార్వతి'' అని బహుముక్తసరిగా అన్నాడు. పార్వతి వచ్చి విసిరింది. అతను ఆ తపననుండి విముక్తి జెందినట్లుగా వెంటనే నిద్రించాడు.

ఆ మరుసటిదినం ఒక అపరిచితవ్యక్తి రోగిని చూడటానికి వచ్చాడు. ఆతను ఎవరూ అడగకుండానే వచ్చి వివేకం పక్కనే ఆసీనుడైనాడు.

''నా ముఖం మంచిశకునంగాదు. అందువల్ల ఇవ్వాళ్టివరకూ రాలేదు'' అని అతడన్నాడు

సీతా పార్వతీ ఆ వ్యక్తివంక అప్పుడుగాని పరీక్షగా చూడలేదు. అతని ముఖంలో జీవకళలేదు. అతనికళ్ళు ప్రేతపుకళ్ళు. అతని చేతులు దారాలవలె వేళ్లాడుతున్నై. అతని గుడ్డలు శుభ్రంగావున్నా అవి మలినంగానే కనబడుతున్నై. పార్వతికి ఆ వ్యక్తిమీద కోపం వచ్చింది.

"ఆయన చాలా బలహీనంగా వున్నాడు. ఎక్కువ మాట్లాడించవద్దు" అని అమె మొహమాటం లేకుండా అన్నది.

ఆ వ్యక్తి ఆ మాటల్నేమాత్రమూ లక్ష్యపెట్టకుండానే- "రెండేముక్కలు" అన్నాడు.

వివేకం అతణ్ణి చూస్తూ "అంగారక దోషం నిజమేనా?" అని ప్రశ్నించి కళ్లుమూసుకున్నాడు, ఏదో ధ్యానముద్రలో నిమగ్నుడైనట్లుగా.

"నీకు జ్యోతిషశాస్త్రంమీద నమ్మకం లేదు గదా?"

"లేనిమాట నిజమే. కొత్త గ్రహాలమాటేమిటి?"

"వట్టిది!"

''నేనడిగినది?''

''నిజం.''

''ఇక వెళ్ళు.''

ఆ వ్యక్తి లేచాడు. అతనివాలకం ఎవరిలోనూ జాలి పుట్టించదు సరిగదా, కేవలం ద్వేషాగ్నిని ప్రకోపింపజేస్తుంది. సీతకు భర్తముఖంలో పురాణాల్లోని సత్యవంతుడు స్ఫురించాడు. ఆ వ్యక్తి గడపదాటినదాకా ఆమె భర్త తలను తన ఒడిలో పెట్టుకొన్నది. గుండెదడకు ఆమె ఒళ్ళంతా చలించిపోతున్నది. ఆమె

శాస్త్రాలు చదువలేదు. ఆ కొత్త వ్యక్తిని తన భర్త ఏమని ప్రశ్నించాడో, అందుకాతని సమాధానాలేమిటో ఆమె వినిపించుకోనుగూడాలేదు. ఆ చిత్రగుప్తుడు గడపదాటితే అంతేచాలు ననుకొన్నది.

ఆ రోజునుంచీ వివేకం ప్రతి గంటా ఏదో ఒక ఆహారం కావాలని కోరటం ప్రారంభించాడు ఏ ద్రవ పదార్థమైనా అతడు నిరాకరించకనే త్రాగటం ఆమెకు తృప్తి కలిగించింది. అప్పుడుగాని ఆమెకు పార్వతి పదివేళ్ళ లెక్కలోని దూర దృష్టి స్ఫురించలేదు. అతని పర్సులో దమ్మిడీ లేదు. ఆమెకేమీ తోచలేదు. ఆమె మెడలో మంగళసూత్రమొక్కటే వున్నది. కాని, సావిత్రియైన తనా ఆ మంగళ సూత్రాన్ని మార్చేది? తనుగాదు; తనుగాదు ఈ ప్రపంచంలోనేగాదు, పదు నాలుగు లోకాల్లోనే ఏ శక్తికీ దానిని తాకే హక్కు, సాహసమూ లేవు.

ఉదయం అతని ముఖంలో కొత్త కళ వచ్చింది. మితంగా మాట్లాడినా అంతర్లీనమై వున్న ఆశతో వుత్సాహంగా పలికాడు అప్పుడామె డబ్బు సంగతి హెచ్చరించింది. అతను తడుముకోకుండా పర్సును భార్యచేతి కందించాడు. అందులో ఇరవై రూపాయలున్నాయ్. ఆమె ఆశ్చర్యానికి అంతులేదు.

"ఎక్కడిది?"

"నా కేంతెల్సు? పార్వతినడుగు."

పార్వతి చేతికున్న ఒక్కటే ఒక బంగారు గాజు కన్పించలేదు. సీత చెల్లెల్ని ఎంగిలి నోటితోనే ముద్దెట్టుకొన్నది ఆమె ఎప్పుడు అమ్మి తెచ్చిందో ఈమెకు తెలియదు.

మరి రెండు రోజుల్లో హఠాత్తుగా మామయ్య ప్రత్యక్షమైనాడు. మామయ్య దేవుడివలె ఆమెకా కష్ట సమయంలో గోచరించాడు. కనకసుందరంగారు గడపలో అడుగు పెడ్తూనే—"పార్వతి వుత్తరం నిన్న సాయంత్రమే అందింది. ఒక రోజు ఆలస్యంగా అన్నమాట!" అన్నారు.

తను కాలగమనాన్ని లెక్కకట్టలేకపోతున్న సావిత్రినని ఆమె కప్పుడు తోచింది. పార్వతి ఏదో వేరొక రూపంలో బయటకు వెళ్ళి దేవకన్యవలె యీ కార్యాలు నిర్వర్తిస్తున్నదేమో!

రోగిని ఒక్క క్షణం చూసి మామయ్య మేనగోడలితో చెప్పాడు—"సన్నిపాతం. జరిగిన రోజులుగాక ఇంకొక మూడు వారాలుగా జరగాలి. భయం లేదు. మందక్కర్లేదు. బలమైన ఆహారం, సపరిచర్యలు-అంతే."

మామయ్య వున్న మూడురోజులూ సీతకు మృత్యువులేని దేవుడికోటలో వున్నట్లున్నది. ఆమెకు వివేక్ ప్రాణంమీద భయం పోయింది. ఆయన వెళ్ళేట ప్పుడు కూడా పార్వతిని పంపటానికి ఆమె యిష్టపడలేదు. ''పార్వతి వాళ్ళబావ కోలుకొన్నదాకా యిక్కడే వుంటుంది'' అన్నది.

వివేక్ వెంటనే కళ్ళు తెరిచి—''ఎందుకు? మనంగాక పార్వతిగూడా నిద్రాహారాలు మానుకోవాలా? అక్కడకు వెళ్ళి విశ్రాంతి తీసుకోనియ్యి'' అన్నాడు భార్యతో.

కనకసుందరంగారు పార్వతివంక చూశాడు. ఆ అమ్మాయి బయలు దేరుతా ననలేదు. ఆయన వెళ్ళుతూ సీత చేతికి పది నోట్లు యిచ్చి ''యిందు'' అన్నాడు.

ఆ పడక పడక నలభై రోజులు వివేకానందం మంచంలోనే వున్నాడు. అతను తిరిగి కోలుకునేసరికి మూడు నెలలు పట్టింది.

* * *

రానురాను అతను పార్వతిమీదనే తన సౌకర్యాలన్నింటికీ ఆధారపడ సాగాడు. నిమీలిత నేత్రాలతో సీత తన మంచం మీదనే కూర్చుని ప్రార్థిస్తుంటే అతని ముఖంలో తీవ్రభయోత్పాతాలు కనిపించేవి.

''వద్దు, వద్దు. నాకు భయంగా వుంది సీతా!'' అని ఆమెను బలవంతాన ప్రార్థననుండి మాన్పించేవాడు. ఇక తప్పనిసరిగా ఆమె వంట ఇంట్లోకి మరలి పోయి తన ప్రార్థన కొనసాగించేది. అతని పరిచర్య లన్నింటికీ పార్వతే ముందుకు వచ్చేది. ఇంద్రజాలపు మహత్తుకు జ్ఞాపకశక్తినీ మెళకువను పోగొట్టు కొన్న వ్యక్తివలె అతడు పార్వతి సపర్యలకు తృప్తితో నిద్రించేవాడు ప్రతి నిద్ర తర్వాత ఎక్కువ బలంతో. విశ్రాంతి పొంది సజీవమైన నరాలతో అతడు తిరిగి మేలుకొనేవాడు.

అతనికి జ్వరం బొత్తుగా తగ్గి పథ్యం తిన్న రోజున భార్యను పిలిచి అన్నాడు:

''శరీరానికీ ఆత్మకూ రాత్రి నాకలలో యుద్ధం జరిగింది.''

ఆమె విశేషించి ప్రశ్నించలేదు. తన పని తాను చూచుకోపోయింది.

అతనిప్పుడు బలహీనతనుండి కోల్కొనే ప్రయత్నం చేస్తున్నాడు. దివికి క్షీణించిన నరాలను అధికారంలో వుంచే విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఒక్క

పేగుల కోపాన్ని పార్వతి పాటలతో అణచివేయ ప్రయత్నిస్తున్నాడు. కాని రోజుకొక్కసారయినా సీతమీద అతని కోపం ప్రసరించేది. ఆమె తన పథ్యానికి చేసిన కట్టుదిట్టాలకు నొచ్చుకొనేట్లు తిరస్కరించేవాడు.

కాని ఏదెట్లు జరిగినా తన ఆత్మ సంఘర్షణను గురించి ఉపమాలతోనో, ఉత్ప్రేక్షలతోనో ఆమెతో సంభాషించనిదే అతనికి శాంతిలేదు. ఆమెతో జరిపిన ప్రతి సంభాషణ తర్వాత గుండె మీద బరువు దింపినట్లుగా అతడు తేలిక పడతాడు.

అతనిప్పుడు లేచి తిరుగుతున్నాడు. కాని ఎంత కోలుకొంటున్నట్లుగా బాహ్యదృష్టికి కన్పించినా ప్రతి చిన్న శ్రమకూ, సంభాషణ వెనుకనున్న ఆలోచనా శక్తికి అలసిపోతున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. పార్వతి వివేకానందానికి కాఫీ అందిస్తూ ఆ సాయంత్రం అన్నది:

''అక్క లేకపోయినట్లయితే బావా, యీ జబ్బులో నువ్వేమయ్యేవాడివి?"

వివేక్ కాఫీ గుక్క మింగటం మాని, ఆమెను ఎగాదిగా పరికించాడు. అతనికి భావోద్వేగంతో అలసట వచ్చింది.

''అవును. చచ్చిపోయేవాణ్ణి. నాకు తెలుసు ''

''మరి అక్కమీద అట్లా విసుగుకుంటారే - దానిమనస్సు ఎంత చివుక్కుమంటుంది?''

అతడు మిగిలిన కాఫీని ఇక చప్పరించక వదిలేశాడు. అతని ముఖమంతా జేగురువర్ణది. పెదిమలు కదిలినవిగాని మాట రాలేదు. ఒక్కక్షణం ప్రయత్నపూర్వకంగా నిశ్శబ్దంగా కూర్చున్నాడు. పార్వతి భయంతో, మారుతున్న అతని ముఖభంగిమలను చూస్తూ దూరంగా నిలబడివున్నది.

చివరి కతడన్నాడు: ''సీత నా అంతరంగిక మూర్తి. నాకు ప్రాణప్రదానం చేసింది. కాని, నాకు హృదయ శాంతి నిచ్చింది నువ్వు - పార్వతివి.''

అతని కన్నుల్లో అలసట కన్పించింది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు బహువేగంగా అతని ముక్కుపుటాలను ఎగురవేశాయ్. ఆ దాడికి అతను తట్టుకోలేక మంచంమీదనే దిండుకు చేరగిలబడ్డాడు; ఒకక్షణం కళ్ళు మూసుకొని తెరిచి, ఏదో ముఖ్య ప్రవచనం పలికి ఆమె ప్రతిభావాలకు నిరీక్షిస్తున్నట్లుగా పార్వతి ముఖంలోకి చూశాడు.

"ఈ మృత్యువేదనలో జీవితపు విలువలన్నీ — నేను లక్ష్యించిన విలువలన్నీ - నన్ను కాదని విడిచిపోయాయ్ సీత వాటిని తిరిగి నాకు తెచ్చి సమర్పించింది. కాని, జీవితపు విశ్వాసాన్నే కోల్పోయినవాడికి నువ్వు తిరిగి విశ్వాసానిచ్చావ్."

"నన్నెందుకు ఆకాశాని కెత్తుతారుబావా! నేను అల్పురాల్ని, మీరు నా రక్షకులు. మీకు సేవచేయటం నా ధర్మం. కాని, నా సేవను అక్క ప్రేమతో, భక్తితో పోల్చుతారా? అక్క పరమసాధ్వి"

ఆ మాటల నతడు తదేక ధ్యానతో విన్నాడు. మొన్నటి కల అతని స్మృతికి వచ్చింది. ఆ కలలో తను సీత మృత్యువును కోరాడు. ఈ సీతే చచ్చిపోతే తను పార్వతిని పెళ్ళాడవచ్చుగదా! పార్వతి - ఆ క్షణాన తన సాన్నిధ్యంలో వున్న పార్వతి పెళ్ళాడి దూరమైపోతుందన్న జ్ఞానం స్ఫురించగానే గజగజ వణికి గడ్డిపోచవలె చలించిన తన మనస్సు - 'ఆమె' నిత్యసాన్నిధ్యానికై సీత మృత్యువును కోరింది తన కల!

పార్వతి చూస్తూండగానే అతనికి ముచ్చెమటలు పోసినవి. దగ్గు తెర వచ్చింది. ఉక్కిరి బిక్కిరై పోయాడు ఆ అలసటకు. చివరకు జేబు గుడ్డ అడ్డం పెట్టుకొని దగ్గునాపజూశాడు. పార్వతి ఆ దృశ్యం చూడలేక అతని శిరస్సును తాకి చెవులు నెమ్మదిగా మూసింది. చీకట్లు కమ్మిన కళ్ళు విప్పి అతనటుపక్కకు తిరిగి తన జేబుగుడ్డ చూచుకొన్నాడు. దానిమీద ఒక్కటే నెత్తురు మరక. తటాలున దాని నతడు దిండుకింద దాచివేశాడు. బావ దగ్గరకు రమ్మని చెప్పేందుకు పార్వతి అతనిని పడుకోపెట్టి సీతవద్దకు పరుగెత్తింది.

* * *

ఆ మరునాటి వుదయమే - వివేక్ నిద్ర లేవకముందే - ఆనాటి కురూపి వ్యక్తి విభూతి రేఖలు ధరించి ప్రత్యక్షమైనాడు. అతడు గడపలో అడుగుపెట్టకముందే పార్వతి కంటబడ్డాడు. ఆమె అతనిని లోనికి రానివ్వలేదు.

"ఒక్కమాట" అని బ్రతిమిలాడాడు ఆ చిత్రగుప్తుడు.

"లాభంలేదు" అని ఆమె గుమ్మంలో అడ్డంగా నిలబడ్డది.

హడలిపోతూ, ముఖాన కుంకుమబొట్టు సరిదిద్దుకుంటూ సీతగూడా పరుగెత్తుకువచ్చి అడ్డం నిలుచున్నది.

"మీకు పుణ్యముంటుంది. ఆయన్ని కదిలించవద్దు."

''ఒక్కటంటే ఒక్కమాట''

ఈ గొడవకు వివేక్ లేవనే లేచి తూలుతూ బయటకు వచ్చాడు. అతన్ని చూడగానే చిత్రగుప్తుడికి ఎక్కడలేని సంతోషమూ వచ్చింది.

"ఆ మాట జ్ఞాపకం చెయ్యటానికి వచ్చాను'' అని వివేక్ ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు.

వివేక్ నిశ్చేష్టుడైపోయాడు పది క్షణాలపాటు. సీత వచ్చి అతడిని అనుకొని నుంచున్నది. ఆమె ఆపాదమస్తకమూ వణికిపోతున్న భర్తను అటుముఖంగా తిప్పింది. అతడు ఆమె కళ్లల్లోకి చూచాడు. ఆమె లలాటాన్ని ముద్దిడుకొని, నొసటి కుంకుమను తన లలాటానికి పూసుకొన్నాడు. సీత యిక ఆపుకోలేక బిగ్గరగా ఏడ్వసాగింది. పార్వతి కనుమూసి తెరచినంతలో ఆ అపశకునపు వ్యక్తి అదృశ్యమైపోయాడు.

రాత్రి భార్య ఒంటరిగా భోంచేస్తూండగా వివేక వెళ్ళి యిన్నాళ్ళకు సరసనే కూర్చుని చెయ్యిజాపాడు ఆమె అతనినోటికి ఒక గోరుముద్ద అందించింది. ఆప్యాయంగా తిన్నాడు. వాళ్లిద్దరూ అదృశ్యంగా ప్రవర్తిస్తూన్న ప్రేమలహరిలో ఒకే దిక్కుకు కొట్టుకుపోతున్నారు. తృప్తితో, ఆత్మైక్యంతో, ఒక్క స్పర్శ సుఖానుభూతినే కోరుతూ మాటలు లేకుండా వారొక నిర్మల దేవలోకంలోకి వెళ్ళిపోయారు. ఆ నిశ్శబ్దాన్ని ఎవరూ ఛేదించలేరు. హఠాత్తుగా అతనినోటినుండి ఆమె పవిత్రనామం వినిపించింది.

"నా సీతా!''

ఆమెకా ఒక్కశబ్దం, అపశకునంగా, తమ ఆత్మైక్యతను భిన్నం చెయ్య వచ్చిన యమపాశంగా తాకింది. ఆమె చేతిలోని ముద్ద కిందపడ్డది. వ్యధిత నయనాలతో ఆమె తమ లోకంనుండి జారి అతనివంకకు తిరిగింది.

''ఒకమాట సీతా! నీ కోరికేమిటి?''

ఆమె ఆ ప్రశ్నకు విస్తుపోలేదు. ధైన్యంగా జవాబిచ్చింది. ఆమె జవాబు కోసం అతడు లిప్తలోని సహస్రభాగంగూడా వేచివుండలేక పోయాడు. ఆమె పెదవులనుండి 'మీ బిడ్డ' అన్న మూడక్షరాలు వినవుత్సహించాడు. కాని, ఆమె ఆ మాట అనలేదు.

"నేను సావిత్రిని. మీ సీతను''.

అతని కన్నులు వికసించినవి అతని బాధ అంతరించింది. ఆమె పాదాలు వెతుకుతూ చీరె చెరగులను తాకాడు. ఆమె అందనివ్వలేదు.

''సీతా! మనకు బిడ్డలు లేందే నేను చచ్చిపోతేనో?''

ఆ అనూహ్య ప్రసంగానికి గూడా ఆమె తొట్రుపడలేదు.

''నేను అనంతసావిత్రిని. నా భర్తకు మృత్యువు లేదు!''

తిరిగి ఇద్దరూ నిశ్శబ్దంలో లీనమైపోయారు. తిరిగి తృప్తిలో ఆత్మైకతలో భిన్నరూపాలు ఏకస్వరూపంగా గోడమీది నీడలో కన్పట్టినవి.

*　　　　*　　　　*

ధరిత్రివలె హిమాలయంవలె అతడు క్షమామూర్తి అయినాడు. సీతమీద యిక ఎప్పుడూ విసుగుకోలేదు. తనకు ఓపికవున్నా లేకపోయినా ఆమెను మౌనంగా అంటిపెట్టుకొని ప్రతి పనిలోనూ సాయపడబోవటం, అతనికి పరిపాటయిపోయింది. అతను పార్వతిని పాట పాడమనలేదు. పార్వతి ఆ యింట లేనట్లే ప్రవర్తించసాగాడు.

ఒకరోజున భార్యతో అన్నాడు - ''సీతా! మనకు బిడ్డలు కలిగే యోగ్యత లేదు.''

జవాబుగా ఆమె అతని తలనిమిరి అన్నది - ''నే నావిషయం యోచించటంలేదు, చెల్లి పెళ్ళిమాట.''

ఆ రాత్రి అతడు గాలి కావాలని వరండాలోనే నిద్రించాడు. అర్ధరాత్రి అతనికి మృదుస్పర్శాజ్ఞానంతో మెళకువచ్చింది. అతని ఒంటిమీద చెయ్యివేసి పార్వతి అతని నాడి పరీక్షిస్తున్నది. ఆమె ముంగురులు చెదరివున్నవి. ఒక హృదయ స్పందన మరొకరికి అస్పష్టంగా వినవస్తున్నది. నిశ్శబ్దంగా ఆమె తన చెయ్యితీసి రాత్రి దీపపు క్రీనీడలో అతని మంచంపక్కనే నిలుచున్నది. కేవలం కళ్ళతో తమ తమ ఆత్మలను పరిశోధించుకొంటున్నారు. ఆమె హఠాత్తుగా ఒంగి అతని దిండు కింది జేబుగుడ్డ తీసి మూగవెలుతురులోనే దానిమీది చిన్నిచిన్ని నెత్తురు గుర్తులను వేలితో చూపించింది.

అమెను అతడు తాకాడు. ''నువ్వు నా ఆత్మ ప్రతినిధివి కాలేవు - పారూ! అది యిటుతే. ఇవి నీ చేతులుగాదు. నీ పాదాలు. వాటినంటి చెబుతున్నాను. సీతకు చెప్పవద్దు, వద్దు నీ తోడు. నా తోడు.''

ఆమె మెల్లగా జేబుగుడ్డను అతని చేతికందించింది. అతడు తిరిగి దానిని దాచివేశాడు. ఆమె దీపం చిన్నదిచేసి లోనికిపోయి అక్కపక్కనే వత్తిగిలింది.

* * *

వివేకానికి ఓపికవచ్చిన రోజునుండే తిరిగి తన పనిలో ప్రవేశించాడు. ఏమిపనో ఎవరికీ తెలియరానిపని! ఈ ఉదంతం జరిగిన మరుసటి దినంనుంచీ అతడు విసుగు విరామం లేకుండా పార్వతిపెళ్ళి మనువులకోసం కాలికి బలపం ధరించాడు. ఏరోజు కారోజు సీతతో అన్ని విషయాలు ముచ్చటించేవాడు ''ఆ పిల్లవాడికి కట్నం కావాలిట. ఈ కుర్రవాడికి అత్తామామలున్న సంబంధం కావాలిట. వాళ్ళకు కట్నంతో పాటు ఆడబిడ్డల లాంఛనాలు జరపాలిట."

ఆమె తిరిగి ప్రశ్నించకుండా అన్నీ వినేది.

మామూలుగా ఆదినాన ఆమెకు ఇంటిపనుల్లో చేదోడుగా వుండబోయాడు. నిజానికి అతడు చెయ్యవలసినదీ, చెయ్యదగినదీ, చెయ్యగలిగినదీ ఏ పనీ లేదు. కాని, అది అతని దినచర్య. ఆమె హఠాత్తుగా పనినాపి ప్రశ్నించింది: ''సావిత్రీదేవి పూర్తి చరిత్ర ఏ గ్రంథంలో వుంటుందో మీరు చెప్పలేదు."

అతడు క్షణంలో మూగబొమ్మై పోయాడు, ఆమె ప్రశ్నను గురించి అతడు ఆలోచించనేలేదు. ఈ ప్రశ్న అతనిని బాధించనేలేదు కాని, అతనిబాధ అంతకన్నా అగాధమైనది. ఆమె హృదయాన్ని తాకినాడు - ఏ ప్రయత్నమూ చేయకుండానే. తిరిగి తన హృదయాన్ని గూడా తాకాడు. ఆ తర్వాత రెండు వేళ్ళు చూపించాడు ఆమెకు. సీత అతని వేళ్ళలో ఒక వేలు మూసి ఒక వేలే చూపించింది. అతడు కాదన్నట్లు తలూపాడు.

ఆ ప్రశ్న బరువును అతడు విముక్తి చెయ్యటానికి ప్రయత్నించాడు.

''నీ హృదయగ్రంథంలో.''

''చెప్పండి.''

''సావిత్రికి ఏ గ్రంథాలు రాయాలి? పృథివిలో పెదిమలున్నంతవరకూ ఆ సాధ్వి చరిత్రకు గ్రంథాల అవసరమేముంది గనక!''

* * *

ఆ రోజు ఆమె వ్రతం నోచుకొన్నది. ఇంటిలో ముగ్గురూ అభ్యంగన స్నానాలు చేశారు. అతనిని పనికి వెళ్ళవద్దన్నది. తన పెళ్ళినాటి చీరె తీసి

పార్వతిని కట్టుకోమన్నది. అతని చేతగూడా బలవంతాన ఉతుకుపడని పట్టు బట్ట కట్టించింది. తన పూజ కాగానే భర్తకు నమస్కరించింది. అతడు వంగి అక్షతలందుకొని ఆమె శిరస్సున విన్రమంగా వేశాడు.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. అప్పటికప్పుడు లేచిపోయి నిద్రమాత్రలు కొని తెచ్చుకొన్నాడు. నిద్రపోతూనే భార్యతో అన్నాడు - "మృత్యువుకుగూడా ఇప్పుడు కొత్తనాగరికత వచ్చింది. ఈ నిద్రమాత్రలు నాలుగు ఎక్కువ వేసు కుంటే ఇక శాశ్వత నిద్రే!''

ఆమె అతని పక్కమీది నిద్రబిళ్ళలసీసా తీసివేసింది. అతని పెదమల్ని నెమ్మదిగా నొక్కింది. ఆ మరునాడుకూడా అతణ్ణి ఆమె ఇంట్లోనే వుండమని వేడ్కొంది.

పార్వతి వచ్చి ''మీరు ఆఫీసు కెందుకు వెళ్ళరు?'' అని ఎదురుగా నుంచొని ప్రశ్నించింది.

''ఏమో!''

''వెళ్ళండి.''

''వెళ్ళను. నాకు ప్రాణప్రదానం చేసిన సావిత్రి ఆజ్ఞ యిది.''

భోజనం తర్వాత అతడు అయాసంతో పడుకొన్నాడు గదిలో. సీత వచ్చి ఒక వింత కోరిక కోరింది- "నన్ను ముద్దు పెట్టుకోండి." అతడు నడుమువంచి లేచి తల్లి బిడ్డను ముద్దెట్టుకొన్నట్లుగా బుగ్గలమీద ముద్దిడుకొన్నాడు. ఆమె తన రెండవ బుగ్గ అందించింది. ఈమాటు ఎంగిలిచేస్తూ ముద్దెట్టుకొని తిరిగి తిరిగి బుగ్గలు తిప్పాడు.

''సావిత్రి గాథ నా హృదయఫలకం మీద వ్రాసివున్నదంటిరే. ఈ కాయితంమీద వ్రాశాను. మీరు నిద్రపోయి లేచి చదుకోండి. ఇదుగో, దిండుకింద వుంచుతున్నా.''

''సరే.''

అతనికి నిన్నటి ఆమె ఒక మేలు జ్ఞప్తికి వచ్చింది. దానితో తృప్తి, ఆత్మ సంయోగం, విభిన్నతనుండి ఏకత్వం కలిగినవి. అతనికి వెంటనే నిద్రవచ్చింది.

అతడు నిద్రలో మసులుతుండగా కల తెగిపోయినది. తన పాదాలవద్ద సీత మెత్తని దేహం తగిలి లేచికూచున్నాడు. గబగబా దిండు తొలిగించి ఆమె కాయితం తీసి చదువసాగాడు.

సడలిపోతున్న ఆమె దేహాన్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు. ''సీతా.... సీతా .. నా సీతా!''

ఆమె కళ్లు అప్పటికే నిమీలితములైనవి. ఆమె వేరొక లోకం నుండి మాట్లాడింది.

''మీ సావిత్రిని. తన నాథుడి ప్రాణాలు రక్షించుకొన్నది. నా నాథు డనంతుడు. మీ సావిత్రి గాథ చదువుకొన్నారా ప్రాణేశ్వరా? నాకు వాగ్దానం చెయ్యండి....చెయ్యండి ''

అతడు కన్నీళ్ళ నాపుకొనకుండానే ఆమె పెదిమలను గట్టిగా ముద్దిడు కొన్నాడు. అతని నోటినుండి ఒక టేమాట—

''నా సీతవు. నా సీతవు.''

ఈ మాటు ఆమె గొంతు దివ్యలోకాలనుండి పలికింది. ''మీరు.... వాగ్దానం యివ్వరూ....ఇవ్వరూ?''

వివేక్ ఆమె ముఖంలో తన ముఖం దాచుకొన్నాడు.

''నేను పార్వతిని అన్యాయం చెయ్యను....చెయ్యను.''

''అట్లాగాదు....'' ఆమె మళ్ళీ అడిగింది - ''నేను ఆ పుత్తరంలో రాసి నట్లుగా... మీ సావిత్రి - మీ పత్ని కోరినట్లుగా—''

అతడు బావురుమని ఏడ్చాడు.

''పార్వతి నా సహధర్మచారిణి ...చేశాను....వాగ్దానం చేశాను ...సీతా!....''

ఆమె అతని చేతుల్లో ఒరిగిపోయింది.

(తెలుగు స్వతంత్ర 8.15 అక్టోబర్ '54)